క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ



వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

వైరారూరల్: రైతులు సరైన సస్యరక్షణ చర్యలు పాటించడంతో పంటల్లో తెగుళ్లను అరికట్టవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. మండలంలోని ఖానాపురం రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాల్లో వర్తి, పత్తి, వేరుశనగ పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓలు సైదులు, కీర్తి, వెంకటనర్సయ్య, రాజేష్ ఉన్నారు.

వరి పైరు పరిశీలన

తల్లాడ: మండలంలోని వెంగన్నపేటలో వైరా కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా వైరా కేవీఏ కోఆర్డినేటర్ కె.రవికుమార్, శాస్త్రవేత్త వి.చైతన్య, తల్లాడ ఏఓ ఎండి.తాజుద్దీన్, ఏఈఓ త్రివేణి వరి పైరును పరిశీలించి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. విచక్షణా రహితంగా పురుగు మందులు వాడకుండా అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అజయ్‌కుమార్ తెలిపారు. వివిధ విభాగాల్లో ఎంపికైన జి.రోహిణి, లాస్యప్రసన్నను ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పుల్లారావు, గౌరికుమారి, శిరీష, రజిని అభినందించారు.
ఎర్రుపాలెం: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గుంటి శైలజ ఎంపికైంది. ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, హెచ్ఎం జీవీఎన్ రాజు, పీడీ నాగేశ్వరరావు అభినందించారు.
మధిర: జిల్లా స్థాయి పోటీల్లో మధిర జోన్ బాలికల కబడ్డీ జూనియర్ టీం విన్నర్‌గా, సీనియర్ టీం రన్నర్‌గా సత్తా చాటుకున్నాయి. హెచ్ఎంలు విజయ, నటరాజకుమారి, కౌన్సిలర్ గద్దల మాధురితో పాటు కె.కృష్ణవేణి, రాములునాయక్, జ్యోతి, నాగూర్‌వలీ, శ్రీనివాసరావు, నరసింహారావు, ప్రశాంతి ఉన్నారు.

వరద బాధితులకు వితరణ

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం మున్నూరు కాపు సంఘం బాధ్యులు మంగళవారం వరద బాధితులకు 450 ప్లేట్లు అందజేశారు. ఖమ్మంలో గోవిందు శ్రీనివాసరావు ఆధ్వర్యాన పంపిణీ చేయగా వేలాద్రి, నాగేశ్వరరావు, రామారావు, వెంకటేశ్వరరావు, పంపాద్రి, నరేష్, రాజేష్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహం అందజేత



కల్లూరు: దేవీ నవరాత్రులు సందర్భంగా కల్లూరులోని కిష్టయ్యబంజర్ గణేష్‌దుర్గ వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో ప్రతిష్ఠించనున్న రూ.2.50 లక్షల విలువైన కనకదుర్గ అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని దాతలు మంగళవారం కమిటీకి అందజేశారు. ఈ మేరకు గురువారం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

మిల్లుల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి

వైరారూరల్: జిల్లాలో రెండు వందల కోట్ల సీఎంఆర్ ధాన్యం కుంభకోణం చేసిన ఎస్‌పీఆర్ రైస్ మిల్లుతో పాటు మిగిలిన నాలుగు రైస్ మిల్లుల యజమానుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని కనకగిరి సిరిపురం లో ఆయన మాట్లాడారు. నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, నల్లమల కోటేశ్వరరావు, చింతనిప్పు చంద్రరావు, లక్ష్మయ్య, మధు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించే చర్యలు

ఎర్రుపాలెం: సమస్యలపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేంద్రప్రభుత్వం జమిలీ ఎన్నికలు, తెలంగాణ, ఏపీలో హైడ్రా, లడ్డూ వివాదాన్ని సృష్టించాయని సీపీఎం నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. మంగళవారం మండలంలోని ఆళ్లపాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడగా శాఖ కార్యదర్శిగా బండి నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి డి.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కె.సురేష్, మర్రి తిరుపతిరావు, ఉద్దండ్ సాహెబ్, అప్పాచారి, పి.లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కన్నీటి కష్టాలు..

నెల రోజులుగా భగీరథ నీరు రాక అవస్థలు
- వరదలతో తెగిపోయిన పైపు లైన్లు..
- నిధులు మంజూరు చేసినా ప్రారంభం కాని మరమ్మతులు



కట్లేరులో కొట్టుకుపోయిన భగీరథ పైపు లైన్(ఫైల్)

ఎర్రుపాలెం: మండల ప్రజలకు తాగునీటి కోసం తిప్పలు తప్పడం లేదు. మిషన్ భగీరథతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యం దెబ్బతింటోంది. మండలంలో నెల రోజులుగా భగీరథ స్కీం ద్వారా తాగునీరు గ్రామాలకు చేరడం లేదు. వైరా రిజర్వాయర్ నుండి మధిర మండలం మీదుగా మామునూరు గ్రామంలోని తాగునీటి ప్రాజెక్టుకు మిషన్ భగీరథ పైపులైన్లు వేశారు. ఇక్కడ నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాల్సివుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మామునూరు ప్రాజెక్టుకు వచ్చే మార్గంలో ఇనగాలి గ్రామ సమీపంలోని కట్లేరులో ఏర్పాటు చేసిన పైపులైను పూర్తిగా వందల మీటర్ల మేరకు కొట్టుకుపోయింది. అదే విధంగా సత్యనారాయణపురం, తెల్లపాలెం, అయ్యవారిగూడెం తదితర గ్రామాల్లో పైపు లైన్లు దెబ్బతిన్నాయి. దీంతో తాగు నీరు సరఫరా ఆగింది.

బాధలు వర్ణనాతీతం..

మీనవోలు, తక్కెళ్లపాడు, రామన్నపాలెం, ఇనగాలి, ములుగుమాడు, సఖినవీడు గ్రామాలకు తప్పా మిగిలిన 25 గ్రామ పంచాయతీల్లోని ప్రజలకు భగీరథ తాగునీరు సరఫరా కావడం నిలిచిపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గ్రామాల్లో స్థానికంగా ఏర్పాటు చేసిన జల వనరులతో తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీనికి తోడు బోడేపూడి సృజల స్రవంతి రక్షిత మంచినీటి పథకం ద్వారా కొన్ని గ్రామాలకు నీటిని సప్లయి చేస్తున్న పరిస్థితి ఉంది. మండలకేంద్రంలో లోకల్ సోర్సు లేదు. కేవలం సృజల స్రవంతి తాగునీరు సరఫరాపైనే ఆధారపడి ఉండాల్సిన దుస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో తరచూ ఈపథకంలో తాగునీరు ఇవ్వలేని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అంతే కాకుండా అసలే అరకొరగా నీరు సంపునకు సరఫరా అవుతుంటే రేమిడిచర్ల, కొత్తపాలెం గ్రామాల ప్రజలు మాత్రం మండలకేంద్రానికే వచ్చి బోడేపూడి సృజల స్రవంతి వాటర్‌ను క్యాన్‌లతో తీసుకెళ్తున్నారు. దీంతో మండలకేంద్రంలో కూడా కొరత ఏర్పడుతుంది.

నిధులున్నా మరమ్మతులు సున్నా..

తాగునీటి సమస్య తీవ్రతను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా అత్యవసరంగా మరమ్మతులు చేయాలని ఆదేశిస్తూ రూ.30లక్షల నిధులు మంజూరు చేశారు. కానీ పనులు మాత్రం ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. నిధులున్నా మరమ్మతులకు కనీసం ప్రారంభానికి కూడా నోచుకోట్లేదు. ఇప్పటికైనా అధికారులు పనులు ప్రారంభించి తాగునీటి కష్టాలు తొలగించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

నీటి కోసం మండలకేంద్రానికి..



మా గ్రామానికి నెల రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. 4 కి.మీ మేరకు దూరం ప్రయాణిస్తూ బైకులపై క్యాన్లులో నీటిని పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని భగీరథ తాగు నీటిని సరఫరా చేయాలి.

– దాసరి మోహన్, రేమిడిచర్ల

నెల రోజులుగా నీరు బంద్..



నెల రోజులుగా మిషన్ భగీరథ తాగు నీరే రావడం లేదు. తరచూ తాగునీటి సరఫరా కాక ఇబ్బంది పడుతున్నాం. బోర్లు పని చేయడం లేదని, విద్యుత్ మోటారు కాలిపోయాయనే సాకులు చెబుతున్నారు. పరిష్కార మార్గంగా అధికారులే ప్రత్యామ్నాయాలు చూడాలి.

– రాధాకృష్ణ, ఎర్రుపాలెం

పది రోజుల్లో సరఫరా

నెల రోజులుగా నీటిని సరఫరా చేయడం లేదనే విషయం వాస్తవమే. వరదలకు పలు చోట్ల పైపు లైన్లు కొట్టుకుపోయాయి. మరమ్మతులకు రూ.30 లక్షల నిధులు కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే టెండర్ పిలవడం జరిగింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే పనులు నిర్వహిస్తాం. మరో 10 రోజుల్లేనే మండలంలోని అన్ని గ్రామాలకు భగీరథ నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– మనీష్ శంకర్, భగీరథ ఏఈ(గ్రిడ్)

సాగర్ నీరు అందక ఎండిపోతున్న వరి



కాల్వ షట్టర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

తల్లాడ: సాగర్ నీరుఅందకపోవడంతో వరి పంట ఎండిపోతోందని మండలంలోని పుణ్యపురం మేజర్ కాల్వ పరిధి ఆయకట్టు రైతులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. మేజర్ కాల్వకు సరిగా నీరు సరఫరా చేయకపోవడంతో పంట ఎండిపోతోందని చెబుతూ నూతనకల్‌కు చెందిన రైతులు కాల్వ షట్టర్ వద్ద నిరసన తెలిపారు. సుమారు 150 ఎకరాల్లో వరి పైరు ఎండిపోతున్నందున సరిపడా నీరు విడుదల చేయాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని మున్సిపాలిటీలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిబాబు, మెడికల్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాధాకృష్ణ, ఎన్విరోన్‌మెంట్ ఇంజనీర్ సమీర్, మున్సిపల్ సిబ్బంది బాబురావు, రవి, పురుషోత్తం, రామారావు పాల్గొన్నారు.
వైరా: వైరా మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి, కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ చింతల వేణు పర్యవేక్షించి పలు సూచనలు చేశారు.

పశు వైద్యశిబిరం

తల్లాడ: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి నిషి జోషి 25 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స నిర్వహించి దూడలకు నట్టల మందు తాగించారు. సూపర్‌వైజర్లు నాగభూషణం, ఎం.వెంకటేశ్వర్‌రావు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ నాగరాజు, చొక్కారావు, గోపాల మిత్రలు ఎస్.బాబురావు, ఆర్.లక్ష్మణ్‌రావు, జి.రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని పల్లిపాడు గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని పానెం శ్రీహరితకు మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం ముచ్చర్ల లక్ష్మీకుమారి కుట్టు మిషన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, చింతలపూడి వెంకటేశ్వరరావు, మరికంటి రామ్‌గోపాల్, ఉంద్రూ శ్యాంబాబు, పెనుగొండ ఉపేందర్‌రావు, చింతోజు నాగేశ్వరరావు, తాటికొండ రాము, కట్ల సురేష్, మాదినేని సునీత పాల్గొన్నారు.

కళాశాలను సందర్శించిన కేయూ బృందం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇటీవల అటానమస్ హోదా రాగా.. కాకతీయ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. కళాశాలలో వసతులు, సైన్స్ ల్యాబ్‌లతో పాటు క్రీడామైదానాన్ని పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి, కళాశాల అభివృద్ధి కమిటీ కన్వీనర్ రామచంద్రం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు. కేయూ నుంచి వచ్చిన బృందంలో డాక్టర్ రాజేంద్ర, ప్రొఫెసర్ హన్మంతు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

కొణిజర్ల: నాలుగు నెలలుగా కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలో ఉన్న రాన్‌కేర్ సిమెంట్ బ్రిక్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం వేతనాలు చెల్లించట్లేదని కార్మికులు మంగళవారం ఫ్యాక్టరీ గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ మేరకు కార్మికులకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలపగా సుంకర సుధాకర్, వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు మాట్లాడుతూ... వేతనాలు, పీఎఫ్ చెల్లించేవరకు నిరసన కొనసాగుతుందన్నారు. కృష్ణ, ఉపేందర్, గోపాలకృష్ణ, సతీష్, కిరణ్, బిచ్చా, పుష్పమ్మ, గోపమ్మ నాగమణి పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

చింతకాని: మహిళలపై రోజురోజుకు పెరిగిపోతున్న దాడులను అరికట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఐద్వా మండల మహాసభను మంగళవారం నిర్వహించారు. ఐద్వా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా లోయ అనిత, అధ్యక్షులుగా కంభం పద్మ ఎన్నికయ్యారు. ఈ సభలో ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి, రాష్ట్ర కమిటీ సభ్యులు పయ్యావుల ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు ‘బతుకమ్మ’

దసరా సెలవులు ప్రారంభం కావడంతో మంగళవారం పలు పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను తయారుచేసి విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో సందడి చేశారు. – సాక్షి నెట్‌వర్క్



మధిర: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



వైరా: మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో..



కల్లూరులో..

కుక్కల దాడిలో 21 గొర్రెలు మృతి

కారేపల్లి: గొర్రెల మందపై వీధి కుక్కలు స్వైరవిహారం చేసి గాయపర్చడంతో 21 జీవాలు మృతి చెందాయి. అంతేకాక మరో పది గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. కారేపల్లి బొడ్రాయిసెంటర్‌లో నివాసముండే జంగా మధుకు చెందిన గొర్రెల మందను సోమవారం రాత్రి ఇంటి వద్ద ఉన్న దొడ్డిలో తోలాడు. సోమవారం అర్ధరాత్రి పదికి పైగా వీధికుక్కలు దొడ్డిలోకి దూకి 21 గొర్రెలను మెడ భాగంలో కరవగా చనిపోయాయి. మరో పది 10 గొర్రెల మెడ పైభాగంలో కరవడంతో తీవ్రంగా గాయపడ్డాయి. మంగళవారం ఈ విషయాన్ని గుర్తించిన మధు కన్నీరుమున్నీరయ్యాడు. సుమారు రూ.3లక్షల మేర నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ

చింతకాని: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ చేసిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని పందిళ్లపల్లిలో రెండు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను గతనెల 19న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి రూ.60వేల విలువైన కాపర్ వైర్ దొంగిలించారు. ఘటనపై నాగులవంచ ఏఈ అన్నారపు ఉమామహేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

ఏటీఎంలో ఏమార్చి నగదు స్వాహా

వైరా: నగదు డ్రా చేసేందుకు వచ్చిన మహిళకు సాయం చేస్తున్నట్లుగా నమ్మించిన వ్యక్తి ఆమె వద్ద ఏటీఎం కార్డును మార్చి రూ.51 వేల నగదు స్వాహా చేశాడు. ఈ మేరకు బాధిత మహిళ మంగళవారం వైరా పోలీసులకు చేసిన ఫిర్యాదు వివరాలు... మండలంలోని ముసలిమడుగుకు చెందిన అంగన్వాడీ టీచర్ తడికమళ్ల రాధ వైరాలోని ప్రైవేట్ బ్యాంకులో రూ.50 వేల రుణం తీసుకుంది. ఈ నగదును ఎస్‌బీఐ ఖాతాలో జమ చేయగా గత నెల 27వ తేదీన డ్రా చేసుకునేందుకు వైరా ఎస్‌బీఐ బ్రాంచ్ పక్కన ఏటీఎం సెంటర్‌కు వెళ్లింది. ఆ సమయాన అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తి రాధకు సాయం చేస్తున్నట్లు నటించి ఆమె ఏటీఎం కార్డును మార్చడంతో పాటు డబ్బులు రావడం లేదని చెప్పాడు. దీంతో రాధ వెళ్లిపోయింది. ఆ తర్వాత ఆమె కార్డు ద్వారా విడతలగా వారీగా రూ.51 వేలు డ్రా చేసుకున్నాడు. ఆమె గత నెల 28, 29వ తేదీల్లో నగదు డ్రా చేసుకునేందుకు వెళ్లగా డబ్బు రాకపోవడంతో పరిశీలించగా తన వద్ద ఉన్న కార్డు నకిలీదని తేలింది. ఈ మేరకు బ్యాంకులో బ్యాలెన్స్ పరిశీలించి పోలీసులను ఆశ్రయించగా వారు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

స్కూల్ బస్సు ఢీకొని గాయాలు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని కప్పలబంధం ఎన్నెస్పీ ప్రధాన కాల్వ సమీపాన మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కల్లూరుకు చెందిన బాలాజీ స్కూల్ బస్సు ఢీకొనగా బత్తులపల్లి నికి చెందిన ఎక్కిరాల గురవయ్య – జవలమ్మ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి కల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు.

కార్యదర్శులు స్థానికంగానే ఉండాలి

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పెనుబల్లి మండల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సర్టిఫికెట్లను త్వరగా అందేలా చూడాలని ఏదైన పనిమీద ప్రజలు వస్తే గౌరవిస్తూ పనులను తక్షణమే చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, నర్సరీలను పరిశీలించి మొక్కలు నాటడంతో పాటు పరిరక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలను అందరికి చేరే విధంగా పారదర్శకంగా చేయాలని, అవినీతి రహితంగా పని చేయాలని సూచించారు. డాక్టర్ మట్టా దయానంద్, నీరజాదేవి, రాజబోయిన కోటేశ్వరరావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, సోమరాజు సీతారామారావు, చీకటి రామారావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఎంపీఓ ఉపేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లారీ యూనియన్ నాయకులకు అభినందన

లారీ యజమానుల సంఘం నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్‌లు అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధ్యక్షుడు రావి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కె ఖలీల్, కార్యదర్శి కొండపల్లి రమేష్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ పాలకుర్తి దాసు, కోశాధికారి ఎస్‌కె మౌలాలీలను శాలువాలతో సత్కరించారు.

ధరణి రిజిస్ట్రేషన్లు పకడ్బందీగా నిర్వహించాలి



రిజిస్ట్రేషన్ల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ

కొణిజర్ల: ధరణి రిజిస్ట్రేషన్లలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా పూర్తిచేయడమేకాక కొనుగోలు, అమ్మకందారుల సంతకాలు స్కాన్ చేసి పొందుపరచాలని ఖమ్మం ఆర్డీఓ గణేష్ సూచించారు. కొణిజర్ల తహసీల్‌ను మంగళవారం సందర్శించిన ఆయన ధరణి స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ల వివరాలు ఆరా తీశారు. అరవై ఏళ్లు దాటిన వారి వేలిముద్రలు, సంతకాలు సేకరించే సమయాన ఎందుకు తీసుకుంటున్నారో చెప్పాలని తెలిపారు. అనంతరం మండలంలోని అంజనాపురం, గద్దలగూడెం పంచాయతీ పరిధిలో నిర్మించే ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ భూ సేకరణపై సమీక్షించారు. తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



మాట్లాడుతున్న చందునాయక్

ముదిగొండ: ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా టీకాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ చందు నాయక్ అన్నారు. ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించిన అనంతరం ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. 30 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరికి బీపీ, షుగర్ సరీక్షలు నిర్వహించి ఎన్‌సీడీ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ మధుసూదన్‌రావు, పీహెచ్ఎన్ రాణి, సూపర్‌వైజర్లు పద్మావతి, లత, ఫార్మసిస్ట్ సత్యావతి, సిబ్బంది పాల్గొన్నారు.

‘లయన్స్’ సభ్యులకు అవార్డులు

సత్తుపల్లిరూరల్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అవార్డుల ఫంక్షన్లో భాగంగా సంవత్సరానికి సత్తుపల్లి లయన్స్ క్లబ్‌కు బెస్ట్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్, సెకండ్ బెస్ట్ సెక్రటరీ, థర్డ్ బెస్ట్ ట్రెజరర్ అవార్డులను గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి, శివప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు. దారా కృష్ణారావు, దొడ్డా కృష్ణయ్య, గంధ్ర సోమిరెడ్డి, జంగా సత్యనారాయణ, మందపాటి చెన్నారెడ్డి, పెనుకొండ రమేష్, గుండు శ్రీనివాసరావులకు బెస్ట్ లీడర్స్ అవార్డు అందజేశారు. గోగడ రవికి బెస్ట్ మెంబర్ అవార్డు జిల్లా గవర్నర్ సిహెచ్‌వి శివప్రసాద్ అందజేశారు.

వేమన పద్యాల పుస్తకాలు పంపిణీ

కల్లూరురూరల్: కల్లూరులోని ఎన్ఎస్పీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆశా స్వచ్ఛంద సేవాసంస్థ, లైవ్ స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా ప్రచురించిన వేమన శతకం పద్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు బి.మధుసూదన్‌రాజు, విశ్రాంత లైబ్రేరియన్ జి.రామకృష్ణ, పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మంగళవారం రాత్రి పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 8,400 నగదు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏ. వంశీకృష్ణ భాగ్యరాజ్ తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి

వైరా: నిరంతరం యువత సమస్యలపై పోరాటు చేసే యువజన ఉద్యమాల సారథి డీవైఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ అన్నారు. వైరాలో సంఘం పట్టణ కమిటీ సమావేశం మంగళవారం పట్టణ కార్యదర్శి నాగుల్‌పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ కార్యాచరణపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చిత్తారు మురళి, షేక్. నాగుల్ పాషా, నాయకులు యాకుబ్ అలీ, వినయ్, కార్తీక్, సురేష్, నరేష్, సాయి, ప్రవీణ్ పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో సత్తా..

- ఉత్తమ మార్కులు సాధించిన పలువురు



రామభద్రరాజు



గౌర్రాజు నాగరాజు



ఈదర స్రవంతి



కృష్ణవేణి

ఎర్రుపాలెం: డీఎస్సీ ఫలితాల్లో ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లకు చెందిన చెన్నంరాజు రామభద్రరాజు స్కూల్ అసిస్టెంట్ విభాగం నుంచి వందకు గాను 77.57 మార్కులతో జిల్లాస్థాయి ద్వితీయ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం ఆయన ఖమ్మంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నాడు. ఇదే మండలం పెద్దగోపవరానికి చెందిన దంపతులు గౌర్రాజు నాగరాజు, ఈదర స్రవంతి ర్యాంకులు సాధించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్పీగా పనిచేస్తున్న నాగరాజు బయాలజికల్ సైన్స్‌లో 75 మార్కులు సాధించగా, ఆయన భార్య స్రవంతి సోషల్ విభాగంలో 70 మార్కులు సాధించింది. ఆమె మధిరలోని బీసీ గురుకులంలో టీజీటీగా పనిచేస్తోంది. ఇక రాజులదేవరపాడుకు చెందిన దుద్దుకూరు కృష్ణవేణి ఎస్‌జీటీ విభాగంలో 71వ ర్యాంకు సాధించింది.



నాగేశ్వరరావు



గురజాల గౌరి

తల్లాడ: మండలం నూతనకల్‌కు చెందిన తెనాలి నాగేశ్వర్‌రావు ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి ఇటీవల గురుకుల పాఠశాలలో టీజీటీ పోస్టు సాధించాడు. సిద్ధిపేట జిల్లా దుబ్బాకలో పనిచేస్తున్న డీఎస్సీ ఫలితాల్లో ఆయన స్కూల్ అసిస్టెంట్ బయాలజీ విభాగంలో 10వ ర్యాంక్ సాధించాడు. అలాగే, ముద్దునూరుకు చెందిన గురజాల గౌరీ బీఎస్సీ, బీఈడీ పూర్తిచేయగా గృహిణి బాధ్యతలు నిర్వర్తిస్తూనే పట్టుదలతో చదివి ఎస్‌జీటీలో 22 వ ర్యాంక్ సాధించింది.



శ్రావణి



బుద్ధ ఉష



శైలజ



రమేష్

ఏన్కూరు : ఏన్కూరుకు చెందిన యాసాను శ్రావణి భద్రాద్రి జిల్లా నుంచి ఎస్జీజీ విభాగంలో 14వ ర్యాంకు సాధించారు. ఆమె భర్త కిరణ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అలాగే, భగవాన్‌నాయక్ తండాకు చెందిన గుగులోతు శైలజ ఎస్జీజీ విభాగంలో 138వ ర్యాంకు సాధించింది. ఇందిరానగర్ కాలనీకి చెందిన ముత్తమాల రమేష్ ఎస్‌జీటీ విభాగంలో 84వ ర్యాంకు సాధించగా బుద్ధ ఉష సైతం అర్హత సాధించింది.



ప్రభాకర్‌రావు

మధిర: మండలంలోని దేశినేనిపాలెంకు చెందిన కర్లకోల ప్రభాకర్‌రావు నిరుపేద కుటుంబంలో జన్మించినా కష్టపడి చదివి రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఎంఏ, బీఈడీ పూర్తి చేసిన ఆయన ప్రస్తుతం స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో పీజీటీగా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో తెలుగు పండిట్, స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికవడం విశేషం.



దారగాని బాబు

ముదిగొండ: మండలంలోని గంధసిరి గ్రామానికి చెందిన దారగాని బాబు డీఎస్సీలో జిల్లాలో 7వ ర్యాంకు సాధించాడు. ఎస్ఏలో 75.40 మార్కులు సాధించగా అభినందించారు.